క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అర్వపల్లి : ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసిన దరఖాస్తులపై మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మాపురంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన సర్వేను ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ గోపి పరిశీలించారు. అనంతరం సర్వే వివరాలను ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఓ సుధీర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు లింగయ్య, పరుశరాములు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి : ఈనెల 12, 13, 14తేదీల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను మండల కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ క్రాంతికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా నమోదైన (కాంపౌండబుల్) కేసుల్లో కక్షిదారులు రాజీ పడి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే పెట్టి కేస్, డ్రంకెన్ డ్రైవ్‌లలో పట్టుబడిన వారు కూడా ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

నాగారం : త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నేడు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.మారయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ముసాయిదా, పోలింగ్ స్టేషన్ల వివరాలపై నాయకులతో సలహాలు, సూచనలు, అభ్యంతరాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని ముక్కా కొత్తగూడెం గ్రామంలో అయ్యప్ప మాలధారులకు స్థానిక ఆర్ఎంపీ తిప్పర్తి భిక్షం-రాణి దంపతులు బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 30మంది మాలాధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు బద్దం అంజిరెడ్డి, వంగాల నాగయ్య, కోడి గంగయ్య, బంటు గంగయ్య, బండారు ధనుష్, అజయ్ తదితరులు ఉన్నారు.

12 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి


ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఏపీఎం మల్లేష్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 15ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 12కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తయ్యాయి. సూర్యనాయక్ తండా, లోయపల్లి కేంద్రాలలో కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. కాగా ఈసారి సన్నధాన్యం కొనుగోలు కోసం అర్వపల్లిలో ప్రత్యేకంగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కూడా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ కేంద్రాల ద్వారా మండల వ్యాప్తంగా సుమారు 1.10లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ బుధవారం వెల్లడించారు.

పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అర్వపల్లి : గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాదిలోనే రాష్ట్ర వ్యాప్తంగా 42మంది వివిధ కారణాలతో చనిపోవడం బాధాకరమన్నారు. గురుకులాల్లో నిత్యం ఏదో ఒక సంఘటన జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అన్ని గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కాసర్లపహాడ్‌లో ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయానికి సొంత భవనం నిర్మాణం కోసం ఏడేళ్ల క్రితం స్థలం సేకరించినా ఇంతవరకు సొంత భవనం నిర్మించకపోవడం శోచనీయమన్నారు. ఇక్కడ భవనం లేక ఈ విద్యాలయాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు, దీంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సొంత భవనాలు నిర్మించి అన్ని వసతులు కల్పించాలని కోరారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- 29కేంద్రాలకు గాను 11అద్దె భవనాల్లోనే నిర్వహణ
- ఇరుకు గదుల్లో అవస్థలు
- కానరాని మౌలిక వసతులు
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సిబ్బంది


పసునూర్‌లో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు


నాగారంలో అద్దెభవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కూనరిల్లుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించకపోవడంతో సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. అద్దె భవనాల్లో సరైన వసతులు లేకపోవడంతో గర్భిణులు, చిన్నారులు కేంద్రాల వైపు చూడడంలేదు. మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించేందుకు గతంలో నిధులను మంజూరు చేసింది. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఏళ్లు గడిచినా సకాలంలో పనులు ముందుకు సాగడంలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. మండలంలో 29అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వాటి పరిధిలో గర్భిణులు 144మంది, బాలింతలు 139, ఆరు నెలల నుంచి 3ఏళ్ల చిన్నారులు 458మంది, 3ఏళ్ల నుంచి 6ఏళ్ల పిల్లలు 542మంది వరకు ఉన్నారు. మండలంలోని 29అంగన్‌వాడీ కేంద్రాల్లో 17రెంట్‌ఫ్రీ భవనాలు ఉండగా, మరో 11కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేవలం ఒక డి.కొత్తపల్లి, పస్తాలలో మాత్రమే అంగన్‌వాడీలకు పక్కా భవనాలు ఉన్నాయి. అద్దె భవనాల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మండలంలోని పసునూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం ఏర్పాటు కొరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.6.50లక్షల నిధులు కేటాయించారు. అనంతరం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ సకాలంలో భవన నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం నిధులు నిలిపివేసింది. దీంతో అంగన్‌వాడీ భవనం నిర్మాణం పిల్లర్ దశకే పరిమితమైంది.

అరకొర వసతులతో అవస్థలు..

తల్లీబిడ్డ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలో అరకొర వసతులతో లబ్ధిదారులకు, నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా చోట్ల రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లే దిక్కవుతున్నాయి. అద్దె భవనాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు సైతం సక్రమంగా లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల మండలంలో ఆరుగురు ఆయాలు రిటైర్డ్ కాగా వారి స్థానాల్లో కొత్త వారిని నియమించలేదు. దీంతో ఆయాలు చేసే పనిభారం అంగన్‌వాడీ టీచర్లపైనే పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించి మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పక్కా భవనాలు లేక ఇబ్బందులు



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనాల్లో సరైన మౌలిక వసతులు లేవు. అలాగే వర్షాలు వచ్చినప్పుడు గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అందించే వస్తువులు తడిపోతున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలి.
– సుమిత్ర, అంగన్‌వాడీ టీచర్, నాగారంబంగ్లా

'ఇందిరా మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి


కోళ్లఫాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు

తుంగతుర్తి : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి ఉపాధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో కోళ్లఫాం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తుందన్నారు. మహిళలు తమ ఇంటి వద్దే స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందేలా పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. మండలంలో వంద మంది డ్వాక్రా మహిళా సంఘాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఫాంకోళ్ల కన్నా నాటుకోళ్లు, పెరటి కోళ్లకు ఎక్కువ డిమాండ్‌తో పాటు ఎక్కువ ధర ఉండడంతో మహిళలకు ఈ పథకం ద్వారా ఇంటి నుంచే ప్రతినెలా రూ.వేల సంపాదించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం పెరిగి ఆయా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణయ్య, ఏపీఎం రాంబాబు, కార్యదర్శి నవీన్, సీసీ యాదగిరి, సీఏఫ్ నర్మద, ఈసీ భిక్షం, దుర్గయ్య, శ్రీను, పద్మ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

అర్వపల్లి : పదోతరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల నోడల్ అధికారి, తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కుంభం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ సందర్భంగా ఉపాధ్యాయుల సహకారంతో సాయంత్రం వేళలో అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్లు అందించాలి


గీత కార్మికులకు సభ్యత్వం అందజేస్తున్న మడ్డి అంజిబాబు

ఆత్మకూర్(ఎస్) : కల్లుగీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కిట్లు అందించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు కోరారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గీత కార్మికుల సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కాటమయ్య రక్షణ కవచం పేరుతో సేఫ్టీ కిట్లును జూలై 14న విడుదల చేసినా ఇంకా పంపిణీ పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. ప్రభుత్వం లెక్కల ప్రకారమే సభ్యత్వం కలిగిన వాళ్లు 25,299వేల మంది ఉన్నారని, సభ్యత్వం లేకుండా వృత్తి చేసే వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ గ్రామాల్లో రెండు మూడు మాత్రమే ఇస్తూ మిగతా వారిని వదిలేస్తున్నారని అన్నారు. రెండు సంవత్సరాల నుంచి ఇప్పటివరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా నిధులు రూ.కోటి 35లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, జెరిపోతుల కృష్ణ, నోముల వెంకన్న, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు బుడిగె లింగయ్య, కాట్ల వెంకన్న, మద్దెల సైదులు, గోదుల ఉపేందర్, కొప్పు రామచంద్రు, కాసాని సత్తయ్య, మూల ఎల్లయ్య, బీసు భిక్షం, బత్తుల వెంకన్న, బట్టిపల్లి పాల్గుణ, చౌగాని దుర్గయ్య, రాచకొండ గోవర్ధన్, యాదగిరి, మల్సూరు, సత్యం, రాములు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


అర్వపల్లి : మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు


ఆత్మకూర్(ఎస్) : క్రీడలను ప్రారంభిస్తున్న మండల అధికారులు

అర్వపల్లి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి కోరారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో నిర్వహించే మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీలు మల్లేష్, సైదులు, దాసయ్య, ఉపాధ్యాయులు అంజలి, విమల, ప్రసన్న, స్వర్ణలత, మధుకర్, శ్రీరాములు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను బుధవారం అధికారులు ప్రారంభించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు క్రీడాకారులను గుర్తించేందుకు ఈ క్రీడలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. ఈ క్రీడల్లో మండల పాఠశాల విద్యార్థులతో పాటు యువజన సంఘాలు యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, ఎంపీడీఓ హసీం, ఏపీఓలు ఈశ్వర్, రాజేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు

నాగారం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నేడు సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు మండల స్థాయిలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం కప్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులు ఉదయం 10గంటలకు స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌కు సకాలంలో హాజరై క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ మారయ్య, ఎంఈఓ వాసం ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

సినీనటుడు మోహన్‌బాబుపై చర్య తీసుకోవాలి


ఆత్మకూర్(ఎస్) : ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న మండల జర్నలిస్టులు


తుంగతుర్తిలో ..

ఆత్మకూర్(ఎస్) : వార్త కవరేజికి వెళ్లిన జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు అమానుషంగా దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల జర్నలిస్టులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. మోహన్‌బాబుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, మరోసారి జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారికి గుణపాఠాలు కావాలని అన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు భూపతి రాములు, జలగం మల్లేష్, సుందర్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

సినీనటుడు మోహన్‌బాబును అరెస్ట్ చేయాలి

తుంగతుర్తి : వార్త కవరేజికి వెళ్లిన జర్నలిస్టులపై దాడికి పాల్పడిన సినీనటుడు మోహన్‌బాబునను వెంటనే అరెస్ట్ చేయాలని మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ దయానందంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు జర్నలిస్టులు మాట్లాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శంకరమంచి రవీందర్‌శర్మ, పూసపల్లి యాదగిరి, తాళ్లపల్లి సోమన్న, వడ్లకొండ శ్రీనివాస్, ఎండీ నజీరోద్దీన్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు

నడిగూడెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు షేక్.జాన్ పాషా, డి.శ్రీనివాసరావు, నాగరాజు, వ్యాయామ అధ్యాపకురాలు సునీత జిల్లా స్థాయికి ఎంపికైన జట్టును అభినందించారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగం


సూర్యాపేటటౌన్ : గణిత ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గణిత ఫోరం సభ్యులు


పెన్‌పహాడ్ : విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ రవి, దాత వనజ


నూతనకల్ : ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి గడ్డమీది గణేష్

సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి దేవరశెట్టి జనార్దన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌కెఎల్‌కె బీఈడీ కళాశాలలో దశరథ మెమోరియల్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను వెలికితీసుకోవాలన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. అదే విధంగా జిల్లా స్థాయి గణిత ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ ఎర్రంశెట్టి రాంబాబు, ఎంఈఓలు శ్రీనివాస్‌గౌడ్, రవి, గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు, దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్‌కుమార్, తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.అశోక్, ప్రధాన కార్యదర్శి దామల్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

పెన్‌పహాడ్ : సూర్యాపేట పట్టణంలో జరిగిన గణిత శాస్త్రం టాలెంట్ టెస్టు ఇంగ్లిష్ మీడియంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షిత్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు మీడియంలో విద్యార్థి తులసి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు ఉపాధ్యాయుడు మైలారపు వెంకన్న జ్ఞాపకార్థం ఆయన భార్య వనజ విజేతలైన హర్షిత్‌కు రూ.1000లు, తులసికి రూ.500ల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి జనార్దన్, ఉపాధ్యాయులు మనోహర్, భిక్షం, రఫీయా పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో పెద్దనెమిల విద్యార్థి

నూతనకల్ : సూర్యాపేట పట్టణంలో బుధవారం నిర్వహించిన గణిత శాస్త్రం తెలుగు మీడియం టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని పెద్దనెమిల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గడ్డమీది గణేష్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం డి.శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి జిల్లా అధికారులు రూ.1000నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోట గోపి


విచారణ చేస్తున్న ఏపీడీ సురేష్

మద్దిరాల : మండలంలోని ముకుందాపురం, గోరెంట్ల, పోలుమల్ల గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాలలో, స్త్రీనిధి సంఘాలలో వీబీకేలు అక్రమాలకు పాల్పడుతున్నారని వస్తున్న ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోట గోపి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యుల స్త్రీనిధి డబ్బులను నెలనెలా చెల్లిస్తామని వీబీకేలు సభ్యుల నుంచి డబ్బులను వసూలు చేసి బ్యాంకులో చెల్లించకుండా వారి సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని, దీంతో మహిళా సంఘం సభ్యులు కలెక్టర్ కార్యాలయం, మండల సమాఖ్య చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. అదే విధంగా రైతుల ప్రయోజనాల కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కోనుగోలు కేంద్రాలలో నిర్వహణ బాధ్యతలను చూసుకుంటున్న వీబీకేలు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేసి ధాన్యం తరుగుతీశారని అన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి వీబీకేలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి పోలోజు సైదులు, పాతూరి మల్లారెడ్డి, నారాయణ ఉన్నారు.

వీబీకేల అక్రమాలపై అధికారుల విచారణ

మండలంలోని ముకుందాపురం, చిన్ననెమిలా గ్రామానికి చెందిన వీబీకేలు అక్రమాలకు పాల్పడుతున్నారని వచ్చిన ఆరోపణలపై ఏపీడీ సురేష్‌తో పాటు జిల్లా అధికారులు బుధవారం గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు చేసిన అక్రమాలు నిజమని తేలితే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీనారాయణ, అంజయ్య, డీఎంజీ మల్లేష్, జిల్లా ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఎం మైసయ్య, సీసీ రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహించడం అభినందనీయం


కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


మునగాల : అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : అనాథలకు అన్నదానం చేయడం అభినందనీయమని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య అన్నారు. సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు-రజని దంపతుల మనవడు పావన వినంద్ జన్మదినం సందర్భంగా బుధవారం మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిరా అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంఘం నాయకులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, హమీద్‌ఖాన్, విద్యాసాగర్‌రావు, రఘువరప్రసాద్, గడ్డం నర్సయ్య, వెంకటేశ్వరరావు ఉన్నారు.

అయ్యప్ప సన్నిధానంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో బుధవారం రిటైర్డ్ లెక్చరర్ మరాల రఘురామయ్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 400 మంది మాలధారులు పాల్గొన్నారు. నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు పాల్గొన్నారు.

16న క్విజ్ పోటీలు

తుంగతుర్తి : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఈనెల 16న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. క్విజ్ పోటీల్లో ప్రతి హైస్కూల్ నుంచి 6వతరగతి నుంచి 10వతరగతి విద్యార్థులు కలిసి ఒక టీంగా పాల్గొనాని తెలిపారు. టీంలో ఐదుగురు సభ్యులు ఉండాలని, క్విజ్ ప్రశ్నలు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.3,016, ద్వితీయ బహుమతి రూ.2,016, తృతీయ బహుమతి 1,016 అందజేయనున్నట్లు, పూర్తి వివరాలకు 90100 00405, 83745 53362ను సంప్రదించాలని కోరారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నూతనకల్ : ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని కొంతమంది చిల్లర రాజకీయాలు చేయడం సరికాదని కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన కొంతమంది తమ స్వార్థ రాజకీయాల కోసం రుణమాఫీ అయినప్పటికీ గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మందుల సామేల్ వద్దకు కొంతమంది మహిళలను పంపి గొడవ చేయించడం సరైనది కాదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సైరెడ్డి సుధీర్‌రెడ్డి, పాల్వాయి రవీందర్, యానాల సురేందర్‌రెడ్డి, కొమ్ము ముత్తయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల కేంద్రానికి చెందిన సీలోజు లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం కాంగ్రెస్ నాగారం గ్రామ శాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిప్పలపల్లి మల్సూర్, కొలిపాక సాయికుమార్, మహేష్, నరేష్, చంద్రశేఖర్, నరేష్, అరుణ్, శివ, సోమశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.